క్లుప్తంగా

సరుకుల వితరణ



నెల్లూరు(బృందావనం) : ఉగాది, రంజాన్ పండగల సందర్భంగా బాలాజీనగర్ మసీదు సెంటర్ వద్ద పారిశుద్ధ్య కార్మికులకు మాజీ కౌన్సిలర్ బాషా రంజాన్ తోఫాను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నుడా మాజీ డైరెక్టర్ ఖాజావలీ, పెంచలనాయుడు, సుధాకర్, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన హరీష్ నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బ్రెయిన్ సర్జరీ చేయాలని డాక్టర్లు తెలపడంతో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న హరీష్ కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన వారు రూ.51 వేలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధి ముగపాటి రమేష్, బుధవారపు బాలాజీ, సోమా గోపాల్, గుత్తికొండ శ్రీనివాసరావు, చింతలపూడి పెంచలయ్య పాల్గొన్నారు.

బకాయిల విడుదలకు వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేత

నెల్లూరురూరల్ : హౌసింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు హౌసింగ్ జిల్లా అధికారులను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని కోరారు.

సహకార సంఘాల ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలో నూతన రైతు ఉత్పత్తి సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని డీసీఓ గుర్రప్ప అన్నారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో అల్లూరు, విడవలూరు, వరికుంటపాడు మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘ మహిళలచే ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ సహకార సంఘ రైతులకు సాంకేతికత, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలిగించి ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం నూతన సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్, బైలాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉద్యోగావకాశాలు



నెల్లూరు (టౌన్) : నేటి సమాజంలో కష్టపడితేనే ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. స్థానిక వెంకటేశ్వరపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన వారికి మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల ఏర్పడి 60 ఏళ్లలో తొలిసారిగా 98 శాతం విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం గొప్ప విషయమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో ప్రభుత్వ ఉద్యోగులు

నెల్లూరు (టౌన్) : సమాజానికి సేవ చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు ముందుంటారని రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ ఆనందకుమార్ తెలిపారు. స్థానిక కొండాయపాళెంలోని నగర ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి నూతనంగా నిర్మించిన వాష్ కుళాయిలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. సీఆర్సీ నెల్లూరు డైరెక్టర్ మనోజ్‌కుమార్, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, ఎంఈఓ మురళీధర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, హెచ్‌ఎం భాస్కరరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కష్టపడితే ఉన్నత శిఖరాలు

• రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డి



జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులను సన్మానిస్తున్న జిల్లా న్యాయవాదులు, జడ్జి యామిని

నెల్లూరు (లీగల్) : జూనియర్ న్యాయవాదులు క్రమశిక్షణతో కష్టపడితే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కనకంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో నెల్లూరు బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో శనివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. సీనియర్ న్యాయవాదులు నిరంతరం చదువుతూ క్రమశిక్షణ, నైతిక విలువలను పాటిస్తూ న్యాయవాద వృత్తిలో రాణించాలన్నారు. సమన్వయంతో పనిచేస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తొలుత ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి, ఇటీవల మృతిచెందిన న్యాయవాదుల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాదులను సన్మానం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు ఎంతో సహకారం అందించారన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు, జిల్లాలోని పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉగాదిని సంతోషంగా జరుపుకోవాలి

నెల్లూరు సిటీ : తెలుగు ప్రజలు ఉగాది పండగను సంతోషంగా జరుపుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి దంపతులు ఆకాంక్షించారు. ఈ మేరకు వారు శనివారం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలన్నారు.

ఆనందం నిండాలి

నెల్లూరు(బృందావనం) : జిల్లా ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. 'విశ్వావసు' నామ సంవత్సరంలో ప్రతిఒక్కరి జీవితంలో ఆనందం నిండాలని ఆకాంక్షించారు.

నేడు, రేపు కార్యకలాపాలు

నెల్లూరు సిటీ : జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆదివారం, సోమవారం కూడా కార్యకలాపాలు జరుగుతాయని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు శనివారం తెలిపారు. రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరుగుతాయన్నారు.

నగరంలో 132 కేవీ సబ్‌స్టేషన్

• సీఎండీ సంతోషరావు



అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో త్వరలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అన్నారు. ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు టౌన్ డివిజన్‌కు సంబంధించి పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని, దీనికి సంబంధించిన శంకుస్థాపన పనులు త్వరలో చేయనున్నామని వివరించారు. అదేవిధంగా గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఎస్పీడీసీఎల్ పరిధిలో ఎక్కడా లేనివిధంగా మొదటిసారిగా కంటైనర్ సబ్‌స్టేషన్‌ను మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం నగరంలోని రేబాలవారి వీధిలో ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి జిల్లాలో జరుగుతున్న విద్యుత్ శాఖ అభివృద్ధి పనులపై మంత్రి నారాయణతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఈ విజయన్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ బాలకేశవులు, డీఈటీ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, పరంధామయ్య, డిప్యూటీ ఈఈలు అశోక్, సునీల్, కిరణ్, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



ప్రత్యేక వేషధారణలో చిన్నారులు

నెల్లూరు (టౌన్) : స్థానిక పోస్టల్ కాలనీలోని శిష్య స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల నృత్యాలతో అలరించారు. అనంతరం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల కరెస్పాండెంట్ మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్వతరెడ్డితో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : స్థానిక రామ్‌జీనగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని 53వ డివిజన్ నాయకుడు వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు, కార్యకర్తలు శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ బలోపేతం దిశగా పనిచేయాలని వారికి సూచించారు. కార్యకర్తలకు తాను అండగా ఉంటానని, పార్టీలో అందరికీ సమ ప్రాధాన్యత కల్పిస్తానని తెలియజేశారు.

ఐదు కిలోల కేన్సర్ గడ్డ తొలగింపు

• ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్



కేన్సర్ గడ్డను తొలగిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఓ మహిళకు అరుదైన ఆపరేషన్ చేసి ఐదు కిలోలకుపైగా ఉన్న కేన్సర్ గడ్డను శనివారం తొలగించారు. నగరంలోని నవాబుపేటకు చెందిన 32 ఏళ్ల నస్రీన్ కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ క్రమంలో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా, డాక్టర్లు గర్భసంచిలో గడ్డ ఉన్నట్టు చెప్పి ఆపరేషన్‌కు దాదాపు రూ.లక్ష కావచ్చని చెప్పారు. పేదరాలైన ఆ మహిళ ప్రభుత్వ పెద్దాస్పత్రికి వచ్చింది. సర్జికల్ అంకాలజిస్ట్ వరుణ్ సారథ్యంలో వైద్యులు విజయలక్ష్మి, యశ్వంత్‌లతో పాటు అనస్థీషియన్ ఖాదర్‌బాషా బృందంగా ఏర్పడి ఆమెకు సర్జరీ విజయవంతంగా చేశారు. కేన్సర్ గడ్డతో పాటు భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా గర్భసంచిని తొలగించారు. ఈ సందర్భంగా అంకాలజిస్ట్ వరుణ్ మాట్లాడుతూ ఇక్కడ అన్ని రకాల కేన్సర్‌లకు ఖర్చులేకుండా వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

వసతుల కల్పనకు వినతి



నెల్లూరు (పొగతోట) : జిల్లాలో ఎరుకుల కాలనీలు అధ్వానంగా ఉన్నాయని, పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఏపీ ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ విద్యారమను శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో 400 కాలనీల్లో ఎరుకుల కులస్తులు జీవనం సాగిస్తున్నారని, రోడ్లు, డ్రెయినేజీ వసతులు కూడా లేవన్నారు. సొంత ఇల్లు లేని స్థితిలో వారు జీవనం సాగిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. శ్యామ్, వెంకయ్య, పోలయ్య, రాజా, నాగరాజు, బాలకృష్ణ, వెంకయ్య పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సేవాసంఘ కమిటీ ఏర్పాటు



నెల్లూరు(బృందావనం) : విరాట్‌నగర్‌లోని వీబీఎస్ కల్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణ పట్టణ సేవా సంఘ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పంచవృత్తుల పతాకావిష్కరణ గావించారు. విశ్వకర్మగాయత్రీదేవి, వీరబ్రహ్మేంద్ర స్వామికి అర్చకుడు బాలకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘ గౌరవాధ్యక్షుడిగా అలిమేలి సుబ్రహ్మణ్యం ఆచారి, వ్యవస్థాపక శాశ్వత అధ్యక్షుడిగా కందుకూరు చంగయ్య ఆచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అలిమెలి శ్రీహరిఆచారి, ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణ ఆచారి, ఉపాధ్యక్షుడిగా కందుకూరు జనార్దన్‌ఆచారి, కోశాధికారిగా దండపాణి సురేష్‌ఆచారి, కార్యదర్శిగా బల్లవోలు రమణయ్య ఆచారితో నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ విశ్రాంత ఎస్‌ఈ నాగశయనరావు, కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ మాట్లాడుతూ సంఘీయులందరూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన ఇందుకూరు రమేష్‌కుమార్‌ఆచారిని సన్మానించారు.

శక్తి యాప్‌తో రక్షణ



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : శక్తి యాప్‌తో మహిళలు, యువతులు, బాలికలకు సంపూర్ణ రక్షణ లభిస్తుందని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు పేర్కొన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సుబేదారుపేటలోని సెయింట్ జోసఫ్ జనరల్ ఆస్పత్రి నర్సింగ్ విద్యార్థినులు, మహిళా సిబ్బందికి శక్తి యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. ప్రతి మహిళ తమ సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం డయల్ 100, 112, 1098, 1093లు, మానవ అక్రమరవాణా, పోక్సో యాక్ట్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై వివరించారు. హాస్పిటల్ అడ్మిన్ సిస్టర్ లూర్దుమేరీ, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌లు టీవీ సుబ్బారావు, సి.కృష్ణారెడ్డి, ఏహెచ్‌టీయూ ఏఎస్సైలు వై.శ్రీహరి, డి.సతీష్, సిబ్బంది ప్రసాద్, టీవీఎస్ రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

• నెల్లూరు సిటీ : మహిళలు, విద్యార్థినులు తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ధనలక్ష్మీపురంలోని బొల్లినేని నర్సింగ్ కాలేజీలో విద్యార్థినులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ అశోక్, రూరల్ ఎస్సై ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



స్వతంత్ర పార్కు ప్రాంగణంలో..



నేతాజీనగర్ నాలుగో వీధిలో..

నెల్లూరు(బృందావనం) : ఉగాది సందర్భంగా ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రంకురోడ్డు గాంధీబొమ్మ దగ్గర స్వతంత్ర పార్కు ప్రాంగణంలో ఉగాది సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషులకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాయకుడు పాటూరు శ్రీనివాసులు, కేతా సుబ్బారావు, కళాకారులు ఆనంద్, మారి, రంగనాథ్ పాల్గొన్నారు.

• పొదలకూరు రోడ్డు నేతాజీనగర్ నాలుగో వీధిలో అల్లూరు రహీం పేదలకు శనివారం వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో గౌసియా, ఆషిక్, సుమయా, అర్షాన్ అలీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలసుధాకర్, అల్లాఉద్దీన్ పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు సిటీ : నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పండగలకు కళాత్మక స్వాగతం



నెల్లూరు(బృందావనం) : మూలాపేట బ్రాహ్మణవీధికి చెందిన గందవళ్ల ఉమాశంకర్ ఉగాది, రంజాన్ పండగలకు కళాత్మకంగా స్వాగతం పలికారు. మర్రి ఆకుపై ఉగాది పచ్చడి, మామిడి పిందెలు, కోయిల చిత్రాన్ని, మరో మర్రి ఆకుపై మక్కా నమూనాను తీర్చిదిద్దారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(బారకాసు) : రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మేయర్ స్రవంతి జయవర్ధన్ దంపతులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.



గుండ్రా సతీష్‌రెడ్డితో మేయర్ దంపతులు

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు



నెల్లూరు (లీగల్) : ఏపీ హైకోర్టు జడ్జి, జస్టిస్ కనకంటి శ్రీనివాసరెడ్డిని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నెల్లూరు ఐక్య వేదిక న్యాయవాదులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు కడుమల రవికుమార్, రామకృష్ణ ప్రసాద్, రంగారావు, మురళీధర్‌రెడ్డి, పద్మాకర్, శంకరయ్య, నక్క శీనయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలు శ్రేయస్కరం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రంజాన్ సందర్భంగా ముస్లింలు చేస్తున్న ఉపవాస దీక్షలు సమాజానికి శ్రేయస్కరమని పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. యస్దానీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 42వ డివిజన్ ఖుద్దూస్ నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెహందీ కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. ముస్లిం సోదరీమణుల కోసం ఉచిత మెహందీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజాహుస్సేనీ, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సిద్దీక్, కార్పొరేటర్లు కరీముల్లా, ఊటుకూరు నాగార్జున, నీలి రాఘవరావు, నాయకులు మున్వర్, అబ్దుల్లా, మస్తాన్, అలీం, జాహీద్ పాల్గొన్నారు.